క్లుప్తంగా

భక్తులకు సౌకర్యాలు కల్పించండి



దర్గాలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న కమిషనర్ రమణయ్య

గుంతకల్లుటౌన్: హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి స్వామి ఉరుసుకు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణా ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కమిషనర్, వక్ఫ్‌బోర్డు అధికారులతో కలిసి దర్గా ఆవరణలో ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపాలిటీ తరఫున కల్పించాల్సిన వసతులను యుద్ధప్రాతిపదికన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ గురప్పయాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణు గోపాల్‌రెడ్డి, ఏఈ హరిక్రిష్ణ పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

గుత్తి: తాడిపత్రిలో ఈ నెల 28, 29 తేదీల్లో ప్రణవ్ అబాకస్ ఆధ్వర్యంలో 10వ ప్రాంతీయ అబాకస్ పోటీలు జరిగాయి. పోటీల్లో గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లకు చెందిన మానీష్ అబాకస్ సెంటర్ నుంచి 34 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో జశ్వంత్, దివ్య, భారతి, కృష్ణ, బాలాజీ, భరత్ లు చాంపియన్లకే చాంపియన్లుగా నిలిచారు. మారుతి మోక్షిత్, నాగ మోక్ష, ప్రశాంత్, కుల్దీప్, అభిరామ్, రోహిత్ గౌడ్, మోక్షిత్ చాంపియన్లుగా నలిచారు. మరో తొమ్మిది మంది టాపర్స్‌గా నిలిచారు. ప్రతిభ కనబరిచన విద్యార్థులను పలువురు అభినందించారు.

అండర్-19 జట్టులో చోటు



భువనేశ్వర్

గుత్తి: అండర్-19 జిల్లా క్రికెట్ జట్టులో గుత్తికి చెందిన భువనేశ్వర్‌కు చోటు దక్కింది. అండర్ -19 జిల్లా జట్టుకు భువనేశ్వర్ ఎంపికైనట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మధు ఆచారి, కోచ్‌లు యుగంధర్‌రెడ్డి, జోషి ఆర్ కుమార్ మంగళవారం తెలిపారు.ఆగస్టు ఒకటి నుంచి నరసరావు పేట, పెరిచెర్ల, మంగళగిరి లలో జరిగే పోటీల్లో భువనేశ్వర్ పాల్గొంటారన్నారు. భువనేశ్వర్ ఎంపిక పట్ల క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడల్లోనూ రాణించాలి



విజేతలను అభినందిస్తున్న ఎస్‌ఓ ఉష

పెద్దవడుగూరు: విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కేజీబీవీ ఎస్‌ఓ ఉష సూచించారు. మంగళవారం గుత్తి మండలం రజాపురంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ మీట్- 2024 నిర్వహించారు. అందులో తమ పాఠశాల విద్యార్థినులు లాంగ్ జంప్ అండర్-16 లో శృతికి ద్వితీయ స్థానం, అండర్- 14 షాట్‌పుట్‌లో ఎం.ఉషకు తృతీయ స్థానం దక్కిందని ఆమె తెలిపారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బందితో కలసి ఆమె విజేతలను అభినందించారు.

ఆపరేటర్లను పర్మినెంట్ చేయాలి

పామిడి: ఏపీ ట్రాన్స్‌కో కాంట్రాక్ట్ ఆపరేటర్లను పర్మినెంట్ చేయాలంటూ పామిడి కాంట్రాక్ట్ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగులు నారాయణస్వామి, అజయ్‌కుమార్, సుదర్శన్ తదితరులు మంత్రి కేశవ్ దృష్టికి తెచ్చారు. ఈ మేరకు వారు అనంతపురంలోని నివాసంలో మంత్రికి వినతి పత్రం సమర్పించారు.

ఎస్టీలకు భూములు కేటాయించాలి



వడిత్యా శంకర్‌నాయక్‌కు సమస్యలు విన్నవిస్తున్న గ్రామస్తులు

పామిడి: మండలంలోని రామగిరి ఎగువ, దిగువ తండాల్లో నివసించే భూమిలేని ఎస్టీలకు భూములు కేటాయించాలని వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్, సర్పంచ్ నారాయణస్వామి తదితరులు కోరారు. మంగళవారం మండలంలోని అనుంపల్లిలో ఏపీ స్టేట్ ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్‌నాయక్ పర్యటించారు. ఈసందర్భంగా వారు గ్రామస్తులతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాసరావు సమక్షంలో ఆయనకు పలు సమస్యలను విన్నవించారు. హంద్రీనీవా కాలువ ద్వారా వెళ్లే నీటిని రామగిరి చెరువులకు వదలాలన్నారు. అలాగే ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను కేటాయించాలన్నారు.

ఆస్పత్రిలో సిబ్బంది కొరత

- పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సు పోస్టుల ఖాళీలతో అందని మెరుగైన వైద్యం
- నైట్ డ్యూటీ కొనసాగింపుపై ఏఎన్‌ఎంలు, ఎమ్‌ఎల్‌హెచ్‌పీల ఆవేదన



గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గార్లదిన్నె: ఆస్పత్రిలో సిబ్బంది కొరతతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ప్రభుత్వం 24 గంటలు ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. దీంతో మండల ప్రజలు సంతోష పడ్డారు. కానీ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉండడంతో మెరుగైన వైద్య సేవలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీకి 143 జీఓ ప్రకారం ముగ్గురు స్టాఫ్ నర్సులను కేటాయించారు. వీరిలో ఒకరు ప్రమోషన్ మీద అనంతపురం ప్రభుత్వాస్పత్రికి బదిలీ కాగా, మరొకరు రిజైన్ చేశారు. దీంతో ఒక స్టాఫ్ నర్సు మాత్రమే విధులు నిర్వహిస్తుండడంతో వైద్యసేవలకు ఇబ్బంది అవుతుందని, జిల్లా వైద్యశాఖ అధికారులు ఇద్దరు స్టాఫ్ నర్సులను డిప్యూటేషన్ మీద గార్లదిన్నె పీహెచ్‌సీకి కేటాయించారు. వారు కొన్ని రోజులు విధులు నిర్వహించిన తర్వాత.. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జిల్లాలోని వైద్యసిబ్బందికి డిప్యుటేషన్ రద్దు చేయడంతో వారు పాత స్థానాలకు వెళ్లారు. ప్రస్తుతం ఒక స్టాఫ్ నర్సు మాత్రమే గార్లదిన్నె పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీ పరిధిలో ప్రజలు వైద్య సేవలు కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో అధికారులు మండలంలోని ఫీల్డ్ స్టాఫ్ ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు పీహెచ్‌సీ విధులు కేటాయించారు. తమపై పని ఒత్తిడి పెరిగిందని, ప్రభుత్వం వెంటనే స్టాఫ్ నర్సులను కేటాయించి, పని భారం తగ్గించాలని ఏఎన్‌ఎంలు కోరుతున్నారు.

రాత్రి డ్యూటీ చేయాలంటే ఇబ్బంది

గార్లదిన్నెలో 44వ జాతీయ రహదారిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుండడంతో వెంటనే ప్రక్కనే ఉన్న గార్లదిన్నె పీహెచ్‌సీకి క్షతగాత్రులను తరలిస్తుంటారు.అయితే రాత్రి సమయంలో ఫీల్డు స్టాఫ్ మాత్రమే విధుల్లో ఉండడంతో ప్రథమ చికిత్స మాత్రమే చేసి ఎమర్జెన్సీ అయితే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. రాత్రి సమయంలో స్టాఫ్ నర్సు, డాక్టర్ అందుబాటులో ఉంటే ఇబ్బందులు ఉండవని, రోగులు, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. గార్లదిన్నె పీహెచ్‌సీకి స్టాఫ్ నర్సులు కేటాయించాలని పలుమార్లు జిల్లా వైద్యశాఖ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని, దీంతో పనిభారంతో పాటు రాత్రి సమయంలో అత్యవసర కేసులు వస్తే ఇబ్బంది అవుతోందని పలువురు ఏఎన్‌ఎంలు, ఎమ్‌ఎల్‌హెచ్‌పీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాచ్‌మెన్‌ను కేటాయించాలి

గార్లదిన్నె పీహెచ్‌సీ వాచ్‌మెన్ లేక రాత్రి సమయంలో ఇద్దరు మాత్రమే డ్యూటీలో ఉండడంతో ఇబ్బంది పడుతున్నామని ఫీల్డ్ సిబ్బంది వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో రాత్రి సమయంలో కొంత మంది వ్యక్తులు మద్యం సేవించి పీహెచ్‌సీలోకి ప్రవేశించి ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు. పీహెచ్‌సీకి నైట్ వాచ్‌మేన్ కేటాయించి, పోలీస్ గస్తీ నిర్వహించాలని ఫీల్డ్ స్టాఫ్ కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలిపాం



గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు స్టాఫ్ నర్సు పోస్టులు, ఒక ఎఫ్ఎన్ఓ పోస్టు ఖాళీగా ఉన్నాయి. పీహెచ్‌సీ 24 గంటలు ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కావడంతో రాత్రి సమయంలో కూడా వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటున్నారు. స్టాఫ్ నర్సు పోస్టులు కేటాయించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నాం. స్టాఫ్ నర్సులు వచ్చే వరకూ మండల ప్రజలు వైద్య సేవలకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఒక సూపర్‌వైజర్ ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో రాత్రి సమయంలో వైద్య సేవలు అందిస్తున్నాం.

– గౌతమి, గార్లదిన్నె పీహెచ్‌సీ వైద్యాధికారిణి

విజేతలకు బహుమతుల ప్రదానం



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థినులు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో జరిగిన బాలికల అథ్లెటిక్స్ మీట్‌లో విజేతలకు బహుమతులను అందజేశారు. పోటీలను ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఎంఈఓ రవినాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో గుత్తి కేజీబీవీ పాఠశాల విద్యార్థిని జాగృతి 60 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచింది. 100 మీటర్ల విభాగంలో రజాపురం గురుకుల పాఠశాల విద్యార్థిని రవళిక, 200 మీటర్ల విభాగంలో గుత్తి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కళ్యాణి, షాట్‌పుట్‌లో గుత్తి ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థిని యజ్ఞప్రియ, లాంగ్‌జంప్‌లో రజాపురం గురుకుల పాఠశాల విద్యార్థిని కావ్యలు మొదటి స్థానాల్లో నిలిచి బంగారు పతకాలను సాధించారు. పోటీలకు 10 పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం బహిష్కరణ



ఎజెండాలోని అంశాలు చదువుతున్న కమిషనర్ శ్రీనివాసులు



సమస్యపై అధికారులను నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ శ్రీనివాసులు, చైర్‌పర్సన్ వన్నూర్‌బీ నిర్వహించిన కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు బహిష్కరించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమైంది. సమావేశం ప్రారంభంలోనే వైఎస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ వరలక్ష్మి, కౌన్సిలర్లు బుసా రూపావతి, వరదరాజులు, ఫరూక్, వాల్మీకి శివ, రాజేశ్వరి, మర్తాడు హసీనా, కేవీ రమణ, రూతమ్మ, అరవింద బాబు, ఖాజా ఖాన్, వెంకట సుబ్బయ్య, పుష్పావతి, నజీర్, నరేష్, సుచరిత, సులోచన, లక్ష్మిరాణి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాలేదు. అదే సమయంలో మున్సిపల్ అధికారులు ఎజెండాలోని పొందు పరిచిన 26 అంశాలను చదవడానికి సిద్ధమవుతుండగా కౌన్సిలర్లందరూ మూక్కుమ్మడిగా అడ్డుకున్నారు. అన్నా క్యాంటీన్ మరమ్మతులకు రూ. 35 లక్షలు ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. అంతే కాకుండా గత మూడు కౌన్సిల్ సమావేశాల్లో తాగునీరు, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్స్, వీధి దీపాలు, రోడ్లు వంటి సమస్యలు అలాగే ఉండిపోయాయన్నారు. వాటన్నింటినీ పరిష్కరించాకే ఎజెండాలోని అంశాలను ఆమోదిస్తామని ఖరాఖండిగా చెప్పి, సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లారు. మున్సిపల్ అధికారులు చేసేది లేక సమావేశాన్ని అర్ధంతరంగా ముగించారు.

విలువ ఆధారిత పదార్థాలపై శిక్షణ అవసరం



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: మహిళలకు ఏదో ఒక రంగంలో నైపుణ్యాలపై శిక్షణ ఎంతో అవసరం అని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి కేవీకేలో స్వర్ణోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషక భద్రత, పెరటి కోళ్ల పెంపకం, కోడి గుడ్లు, మాంసం పోషక లాభాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే నైపుణ్యాలపై శిక్షణ అవసరమన్నారు. రైతులకు అందుబాటులో ఉంచే విత్తనాలు, కోళ్లు, పనిముట్లు, విలువ ఆధారిత పదార్థాలపై నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ రైతులు, మహిళలు పెరటి కోళ్ల పెంపకం ద్వారా మంచి లాభాలు పొందవచ్చన్నారు. చికెన్, మాంసం, గుడ్లు వంటి పదార్థాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉందన్నారు. అనంతరం పెరటి కోళ్ల పెంపకం, పశు పోషణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుధారాణి, డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ శశికళ, చందన, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తిచేయాలి



ఖాదర్‌పేట జెడ్పీహైస్కూల్‌లో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్-257 రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటరమణ

పామిడి: ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తిచేయాలని ఏపీటీఎఫ్-257 రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బీ వెంకటరమణ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. అందులో భాగంగా ఖాదర్‌పేట జెడ్పీ హైస్కూల్‌లోని సంఘ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యావ్యవస్థకు శరఘాతంగా మారిన జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ అభ్యర్థులను రెగ్యులర్ ప్రాతిపాదికన కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షాన ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలను సమాంతరంగా నడపాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కే ఉజ్జీనప్ప, అధ్యక్షుడు నూర్‌మహమ్మద్, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జాకీర్‌హుసేన్, మల్లికార్జున, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజిత్ నాయక్ వర్ధంతి



రంజిత్‌నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ట్రస్టు సభ్యులు

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ మాజీ అధ్యక్షుడు, సంత్ శ్రీ సేవాలాల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, సేవాలాల్ ఆలయ అభివృద్ధికి కృషి చేసిన పూజారి రంజిత్‌నాయక్ 21వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రంజిత్‌నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో మెగా వైద్య శిబిరం నిర్వహించి, 325 మందికి 2డీ ఎకో, బీపీ, షుగర్, ఎముకలు, కీళ్లు, స్త్రీలకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రమణనాయక్, శ్రావణ్, దేవేంద్రనాయక్, సందీప్‌కుమార్, ప్రవీణ్, నవీన్‌లు పరీక్షలు చేశారు. అనంతరం టీటీడీ కల్యాణమండపంలో ట్రస్టు కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సేవాలాల్ ట్రస్టు అధ్యక్షుడు కొర్ర జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి అశ్వత్థనాయక్‌లు మాట్లాడుతూ సేవాగఢ్‌లో రంజిత్ నాయక్ పేరుతో డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పాలిటెక్నిక్, మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రవీంద్రనాయక్, బాలనాయక్, వెంకటరమణనాయక్, రామచంద్రనాయక్, సుబ్రమణ్యంనాయక్, శేఖర్‌నాయక్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి: మండల కేంద్రంలోని కమలపాడు రహదారిలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో వృద్ధులకు మంగళవారం యాడికి గ్రామానికి చెందిన ఎత్తిరాజులు అన్నదానం ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా ఆయనకు ఆశ్రమ నిర్వాహకుడు బత్తుల ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా మైదానంలో అభివృద్ధి పనులు



జూనియర్ కళాశాల మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని మంగళవారం ఆర్డీటీ అధికారులు చదును చేశారు. చిన్నపాటి వర్షానికే మైదానం జలమయమై క్రీడాకారులు, వాకర్స్‌కు చాలా ఇబ్బందికరంగా మారింది. వారి వినతి మేరకు మైదానం చదును చేసేందుకు ఆర్డీటీ ముందుకొచ్చింది. మంగళవారం ఆర్డీటీ కోచ్ భార్గవ్ దగ్గరుండి ట్రాక్టర్‌తో క్రీడా మైదానాన్ని చదును చేయించారు.

యూనిఫాం పంపిణీ



యూనిఫామ్ అందజేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫామ్ మంగళవారం పాఠశాలలకు అందజేసినట్లు ఎంఈఓలు చంద్రనాయక్, వెంకటరమణ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ప్రభుత్వం స్టూడెంట్స్ కిట్స్ పంపిణీలో భాగంగా యూనిఫాం అందజేశామన్నారు. ఆయా గ్రామాల్లో హెచ్‌ఎంలు విద్యార్థులకు వెంటనే యూనిఫామ్ అందజేయాలన్నారు.

ఇంటర్ పుస్తకాల పంపిణీ

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు మంగళవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓలు చంద్రానాయక్, వెంకటరమణనాయక్ తెలిపారు. ఎంఈఓలు మాట్లాడుతూ మోడల్, కస్తూరిబా బాలికల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల పాఠ్య పుస్తకాలూ పంపిణీ చేశామన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఎస్‌ఓ, ప్రిన్సిపాల్‌కు సూచించారు.

నేడు మండల సమావేశం

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 31న ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

కౌలు రైతులకు అవగాహన

గుంతకల్లు రూరల్: మండలంలోని నాగసముద్రం, అయ్యవారుపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ సిబ్బంది కౌలు రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ స్వాతి మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేస్తోందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూ యజమాని పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ వివరాలతో సంబంధిత రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

అంచనా వ్యయం చెల్లించాలి

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని షారోన్ నగర్‌కు చెందిన కాలనీవాసులు విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రం అందజేశారని, అంచనా వ్యయం (ఎస్టిమేషన్ కాస్ట్) చెల్లిస్తే విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ సాయి శంకర్ తెలిపారు. డీఈఈ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంచనా వ్యయం మున్సిపల్ అధికారులు లేదా కాలనీవాసులు చెల్లించాలన్నా రు. ఒక వేళ తర్వాత అంచనా వ్యయం చెల్లిస్తామని కాలనీవాసులు అంగీకార పత్రం ఇచ్చినా విద్యుత్ సదుపాయం కల్పిస్తామన్నారు. విషయాన్ని షారోన్ కాలనీవాసులు గమనించాలన్నారు.

జలధికి తరలిన పీర్లు



గార్లదిన్నె: మండలంలోని కమలాపురంలో మంగళవారం జలధి వేడుకలు ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పీర్లు అగ్నిగుండం ప్రవేశం చేసి జలధికి తరలి వెళ్లాయి. అంతకుముందు మేళతాళాల మధ్య పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. భక్తులు దారి పొడవునా నీళ్లు పోసి, చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

కారు బోల్తా.. తప్పిన ప్రాణాపాయం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని నార్పల రహదారిపై కారు బోల్తా పడింది. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురం నుంచి నార్పల వైపు వెళ్తున్న కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొని రహదారిపై బోల్తా పడింది. కారులో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: బీటెక్ చదువుతున్న విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని మానవతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, సలీం మాలిక్, విజయ నగర లా కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వాసవీలత సూచించారు. మంగళవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్టూడెంట్ ఇంటరడక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల భాషపై అవగాహన పెంచుకోవాలన్నారు. చదువులతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించు కోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ గురు సిద్ధప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసుల ప్రారంభం



బస్సు సర్వీస్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయరామ్

గుంతకల్లుటౌన్: గుంతకల్లు- తిరుపతి, ఆదోనికి వెళ్లే మూడు బస్సు సర్వీసులను ఎమ్మెల్యే జయరామ్ ప్రారంభించారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు తిరుపతితో పాటు ఆదోనికి రెండు సర్వీసులను అదనంగా ప్రారంభించినట్లు ఇన్‌చార్జ్ డీఎం బాలాజీ దయాళ్ తెలిపారు. అనంతరం డిపోలో తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు కార్మికులు వినతిపత్రం అందజేశారు.

సేవాలాల్‌ను దర్శించుకున్న ఎమ్మెల్యే

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్‌లోని బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్, మాతా జగదాంబ అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు సేవాలాల్ మహరాజ్ ట్రస్టు సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్ష, ఉపాధ్యక్షుడు జగన్నాథరావు, కేశవనాయక్, సభ్యులు అశ్వత్థనాయక్, రవీంద్రనాయక్, శేఖర్‌నాయక్, సుబ్రమణ్యం నాయక్, అర్చకుడు మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

గుంతకల్లుటౌన్/గుంతకల్లురూరల్/శింగనమల/గార్లదిన్నె: గుంతకల్లు పట్టణంలో ఆగస్టు 1న ఉదయం 6 నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులు 1,2 తేదీల్లో తప్పనిసరిగా ఇళ్ల వద్ద ఉండాలని గుంతకల్లు ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి సూచించారు. అలాగే శింగనమల మండలంలో 6,469 మందికి ఆగస్టు 1న పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ రమణ తెలిపారు. గార్లదిన్నె మండలంలో 7,872 మందికి పింఛన్లు పంపిణీ చేస్తారని మత్స్యశాఖ డీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులనాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి తెలిపారు.